# 11

# మమతలు

"డబ్బు అధికారం కులం స్వార్థం అంతస్థు ముందు ప్రేమలన్నీ ఉత్తవే" మనస్సులో మరోసారి అనుకున్నాడు కాంతయ్య.

కాంతయ్య బస్సెక్కుదామనుకొని వచ్చాడు. జగిత్యాల కొత్త బస్టాండు ఎదుట గుడిసె హోటల్లో బెంచి మీద కూర్చున్నాడు. పేపరు చూస్తూ బస్టాండు లోపలికి వెళ్తున్న బస్సుల బోర్డులు చూస్తున్నాడు. అతను ఎక్కాల్సిన బస్సులు వస్తున్నాయి పోతున్నాయి అతను అక్కన్నించి కదల్లేదు.

ఏది ప్రేమ, ఆ ప్రేమంతా ఎక్కడ పోయింది. ప్రేమ ముందు అన్ని ఓడిపోతాయి అనుకున్నాడు కాంతయ్య. కాని అలా జరగలేదు. ఇది ప్రేమ అవునా కాదా అనే అంతస్సంఘర్షణతో అతని బుర్ర బద్దలవుతున్నది. తన ప్రయాణ నిర్ణయం మార్చుకొని పక్కనే ఉన్న పార్కులో కాసేపు కూర్చున్నాడు. కొలిక్కిరాని ఘర్షణతో ఎక్కడెక్కడో తిరిగి యింటిదారి పట్టాడు.

తల్లి చంద్రమ్మ కొడుకోసమే ఎదిరిచూస్తోంది. పొద్దట్నించి తినకుండా సరవ్వ వచ్చే వేళకు తప్పించుకొని ఎటేటో తిరుగుతున్నాడు కొడుకు. నాలుగు రోజుల్నించి యిదే తిరుగుడు. ఏదో గుర్తొచ్చి కొంగుతో కళ్లొత్తుకుంటూ అంది చంద్రమ్మ.

"సరవ్వ నీకోసం చూసి చూసి పోయె. రాత్రికి మనల్ని బోయినానికి రమ్మన్నది. నేను ఊర్లె కచ్చి అయిదు రోజులాయె అత్తా. కాంతయ్య ఒకసారన్న కలువక పాయె. నేనస్తే కలువక పాయె, మా యింటికి రాకపోయె. నేను ఏం పాపం చేసిన అత్తా...? నా మొకం జూడకుంట తప్పిచ్చుకుంటుండు అని ఏడ్చింది సరవ్వ."

కొడుకు కాంతయ్య ముహంలో మారుతున్న రంగులు చూసి నిశ్శబ్దమై పోయింది చంద్రమ్మ. కత్తిరిస్తున్న బీడీల ఆకు పక్కన పెట్టి అన్నం వడ్డించింది. కాంతయ్య ఏదో తిన్నాననిపించుకొని మంచంలో ఒరిగాడు. దుప్పటి కప్పుకొని కళ్లు మూసుకున్నాడు.

'సరూ.... నా బతుకిట్లా కావడంలో నీ బాధ్యతేమీ లేదా! నా బతుకిట్లా కావడానికి నీ స్వార్థం కారణం కాదా! రాష్ట్రంలో నువ్విప్పుడు ఒక మేధావిగా ఎదుగుతున్నావు. ఇపుడు నిన్ను కలవాలంటేనే భయం. పెళ్లయినాక నువు చాలా మారిపోయినవు. నీలో అంత ఆత్మవిశ్వాసం ఎలా వచ్చిందో నాకు ఆశ్చర్యం. నీ కళ్ళల్లోని ఆ వెలుగు చూస్తే నాకు బెరుకు. నీకు దూరంగా పారిపోవాలనిపిస్తుంది. కాని అంతలోనే నా సరూ ఎంత ఎదిగిపోయిందో అని సంతోషంతో మనస్సు ఉరకలు వేస్తుంది...

... సరూ! నీకు ఈ అభివృద్ధి నీవు స్త్రీవి కావడం వల్ల అందిందా, నీ కులం కారణంగా సాధ్యపడిందా? నీకందిన ఈ అభివృద్ధి, గౌరవం, అంతస్థు నాకు ఎందుకు అందలేదు. మీకు యింతలోనే యింత బలగం సర్కిల్ ఎట్లా ఏర్పడింది. నాకెందుకు లేదు? మా అమ్మ యిప్పటికీ బీడీలు చేస్తూనే ఉంది. మీ అమ్మేమో యిప్పుడు బీడీలు బందు చేసి వచ్చినవాళ్లకు టీ, టిఫిన్లు అందించడానికే టైం చాలక ఆయాస పడుతోంది.

... సరూ! నువ్వు నాలో ఎందుకు భాగమై పోయావు. నీ ముఖ వర్చస్సులో లోకమంతా తెలుసుకున్నట్టు ఆ తేజస్సు ఎలా వచ్చింది. పెళ్ళయ్యాక నీ నడకలో మరింత నిండుదనం వచ్చింది. పట్నవాసం వల్ల నీ శరీరం నునుపు దేరింది. నీ భాష మారింది. నీ చీరల రంగులు మారినై. నువ్వు ప్యాంటూ షర్టూ వేసుకుంటే నాకు అదోలా ఉంటుంది. అపుడు నువ్వు నా సరూవి కాదనిపిస్తుంది....' ఆలోచిస్తుంటే గతమంతా ఒక కలగా మిగిలిపోయింది. ఎన్ని బాసలో... అన్నీ కల్లలైపోయాయి.

❄ ❄ ❄

"కాంత్! పుట్టి ఊహ తెలిసినప్పటినుంచి నువ్వేనా ప్రాణ స్నేహితుడివి. గైడువి, ఫిలాసఫర్‌వి. అంతకన్నా ఎక్కువ. నీ సహకారం, తోడు, నీడ లేని

నా జీవితం ఊహించగలనా? నా ఈ జీవితంలో ఎదుగుదల నీవు లేకుండా సాధ్యమా?... ఆ చర్చలు ఇప్పుడు వద్దు. ముందు నువ్వు పెళ్ళి చేసుకో. నీకంటూ ఒక స్థిర జీవితం ఏర్పడుతుంది. నా వల్లే నీ జీవితం యిలా అయ్యిందనే అపనింద నుంచి నన్ను తప్పించు."

"అది అపనిందా! నిజం కాదా!" ఇద్దరి మధ్య వాదాలు పెరిగాయి. సరూ కాస్త తగ్గి అనునయంగా అంది. "కాంత్! నీతో ఏకీభవిస్తున్నా. అలా అని యిలా ఒంటరిగా ఎంతకాలం ఉంటావు. నా మీద నీకు ఏ కాస్త గౌరవం, ప్రేమ ఉన్నా నా మంచి కోసమైనా నువ్వు పెళ్లి చేసుకో" అంటూ ప్రాధేయపడింది.

కాంతయ్య కాసేపటికి సరూ మాటలోని ఔచిత్యాన్ని గుర్తించాడు.

"అయితే సరూ - నువ్వే సంబంధాలు వెతుకు. నాకు ఎలాంటి భార్య కావాలో నీ కన్నా బాగా ఎవరికి తెలుసు? పెళ్లయ్యాక నీలా ఎదగగలిగే జీవితం సాధ్యపడే సంబంధం చూడు. కాని ఇపుడు నీలా ఎదగడం సాధ్యమా! పెళ్లయ్యాక మా బతుకు ఆగిపోయిన బతుకుగా మిగిలిపోతుంది." విషాదంగా అన్నాడు కాంతయ్య.

"కాంత్! కొన్ని విషయాలు కాలం మీద తెల్సివస్తాయి. కొన్నేమో వయస్సుననుసరించి తెల్సివస్తాయి. మరికొన్ని విషయాలు అనుభవం మీదో, పెళ్ళయ్యాకో తెల్సి వస్తాయి. బ్రహ్మచారులకు కొన్ని విషయాలు తెలిసే అవకాశం లేదు. పెళ్ళయ్యాక నాలాగే నీలోనూ ఒక స్థిరత్వంలో కూడిన ఆత్మవిశ్వాసం. హుందాతనం వస్తాయి. అపుడు నేనంటే యిపుడున్న భయమూ, బెరికి తగ్గిపోతాయి. ఒకరి జీవితం మరొకరి జీవితంలా ఉండదు. నీవు - నీ భార్య మా కన్నా ఉన్నతంగా ఎదుగుతారనే నా విశ్వాసం."

"సరూ .... మన పెళ్ళి తప్పిపోయినందుకు నీకేమీ బాధ లేదా! ఇంత నిబ్బరంగా ఎలా మాట్లాడ గలుగుతున్నావు." ఆశ్చర్యపోయాడు కాంతయ్య.

"కాంత్! కాలం గాయాల్ని మాన్పుతుంది. జ్ఞాపకాలు గాయాల్ని కెలుకుతాయి. కొత్త అనుభవాలు, కొత్త పరిచయాలు, కొత్త జీవితాలు, కొత్త జ్ఞాపకాల్ని సృష్టిస్తాయి. అవి పాత జ్ఞాపకాల్ని మరుగు పరుస్తాయి. ఇపుడు

నేనూ - నా భర్త సుఖంగా ఉన్నామంటే ఇది కొత్త జీవితం. ఇవి కొత్త అనుబంధాలు. వీటి అడుగున ఉన్న మన ప్రేమ జ్ఞాపకాలు గుర్తొచ్చి అపుడపుడు విషాద మౌతుంది మనస్సు. కానీ జ్ఞాపకాల కన్నా వర్తమానం ఉన్నతమైంది. పారిపోలేనిది. అందుకే మనస్సుకు ఏకాంతం దొరికితే నీరు తేట పడినట్టు మన జ్ఞాపకాలు పైకి తేలుతాయి. అందుకని మనస్సుకు ఏకాంతం దొరక్కుండా తీరిక లేని పని సృష్టించుకున్నాను. అందులో భాగమే ఈ స్త్రీవాద అధ్యయనం - నువ్వు అంటున్న మేధోతనం."

"అంటే మన ప్రేమ జ్ఞాపకాల్ని చెరిపేస్తున్నావా!"

"కాంత్, నువ్వెందుకలా అపార్థాలు తీస్తావు. నీకెలా అర్థం చేయించాలో తెలియడంలేదు. పెళ్లి చేసికొంటే నీకు కొన్నైనా అర్థమవుతాయనుకుంటాను. ఇపుడున్న నా యీ జీవితం వాస్తవం. ఒక భార్యగా, ఉద్యోగినిగా, తల్లిగా, కోడలిగా ఈ వాస్తవ ప్రపంచంలో నేను జీవించక తప్పదు. అప్పుడే వాస్తవ జీవితం ముందుకొచ్చి మన ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు క్రమంగా దూరమవుతున్న పాటలా శబ్దంలోంచి నిశ్శబ్దంలోకి ప్రవహిస్తాయి."

"సరూ..... నువ్వు చాలా మాటలు నేర్చావు. నన్ను మరిచిపోవాలనే నిర్ణయించుకున్నానని స్పష్టంగా చెప్పకుండా యీ డొంక తిరుగుడెందుకు?"

సరూ గతాన్ని గుర్తు చేసుకుంది. కాంత్, చేసిన తప్పుకు కూడా తననే తప్పు పట్టడం బాధించింది. తానపుడు ఎంతో చొరవ తీసుకుంది. ఇప్పుడు తననే మాటలు అనడంతో ఊరుకోలేకపోయింది.

దేవదాసు అన్నీవున్నా పిరికివాడు. పార్వతి ఎంతో సాహసికురాలు. అయినా దేవదాసుదేమి తప్పులేనట్టు సినిమాలు తీశారు. శరత్‌బాబు నిజానికి దేవదాసు పిరికివాడని నవలలో స్పష్టంగా రాశాడు.

అలాగే కాంత్ కూడా పేదరికం ఇన్ఫిరియారిటీ భయాలతో పిరికివాడుగా ప్రవర్తించాడు. అయినా తనది తప్పు కాదన్నట్టు నాదే తప్పన్నట్టు కాంత్ మాట్లాడ్డం సరూకి కోపం తెప్పించింది.

...ఉస్మానియా యూనివర్శిటీలో చదువుకుంటున్నప్పుడు ఎంతో స్వేచ్ఛ ఉండేది. అప్పుడు రిజిస్ట్రేషన్ పెళ్లి చేసుకున్నా, ఆర్య సమాజ్ పెళ్లి చేసుకున్నా

తమ తల్లులు హాయిగా సంతోషించేవాళ్లు. అందుకు ఏ అడ్డంకులు లేకుండె. అప్పుడేమో కాంత్ వెనక్కి తగ్గాడు. చెల్లిపెళ్లి అంటూ సాకులు చెప్పాడు. రోషంతో కాంత్‌ను నిలదీసింది.

'కాంత్! యూనివర్శిటీ క్యాంపస్‌లో మనం చట్టాపట్టాలేసుకొని తిరిగినవన్నీ మరిచి పోయావా! మొగుడు పెళ్లాలు అంటూ స్నేహితులు నవ్వుతూ గేలి చేస్తుంటే అవును మేం పుట్టకముందే మొగుడు పెళ్లాలం అని మా అమ్మలు బాసలు చేసుకున్నారు అని మనం తిప్పికొట్టిన విషయాలు మర్చిపోయావా? ...అందరు కలిసి ఆనందంగా మనకు పెళ్లి చేద్దామని పూనుకుంటే నువ్వు ఏమన్నావో గుర్తుందా?' అని సీరియస్‌గా అడుగుదామనుకుంది సరూ. కాని కాంత్‌ని మరింత బాధపెట్టినట్టు అవుతుందని తాను స్త్రీనని పెళ్లయ్యాక అలా మాట్లాడకూడదని తనను తాను కంట్రోల్ చేసుకుంది. అయినా ఆవేశం ఆగలేదు.

"కాంత్, అప్పుడు లేచిపోదామంటే నువ్వు ధైర్యం చేయలేదు. అమ్మా, చెల్లీ, యింకా ఏదేదో అన్నావు. ఇప్పుడు ఎంతెంత అభాండాలు వేస్తున్నావు. నువ్విలా అంటుంటే నా హృదయంలో ఎంత బాధ కలుగుతున్నదో నీకు తెలుసా? నేనిపుడు సంసారం చేస్తున్న స్త్రీని. ఇపుడు నేను ఓ దేవదా... ఓ పార్వతీ... అని ఏడ్చినట్టు ఏడుస్తూ కూర్చుంటే సంతోషమా!

స్త్రీలు ఎక్కడో పుట్టి ఎక్కడో నాటేయబడే మొక్కల లాంటివారు. పెళ్ళయ్యాక ఈ వ్యవస్థలో స్త్రీలకు అంతకు క్రితం ఉన్న ప్రేమ విషాదాలు వ్యక్తం నుంచి అవ్యక్తం చేయబడతాయి. బాధను సైతం వ్యక్తం చేసే అవకాశం యీయదు ఈ సమాజం.

కొత్త అనుభవాలతో కొత్త జ్ఞాపకాలతో అవ్యక్తాలు కాలక్రమంలో అదృశ్యం అవుతుంటాయి. అవి మనస్సు మీద వేసే ముద్రలు మాత్రం మిగిలిపోతాయి. ఈ ముద్రలే అంతచ్చేతనగా రూపొంది వర్తమానంపై ప్రభావం వేస్తాయంటాడు ఫ్రాయిడ్. అయితే అంతచ్చేతనగా మిగిలే ముద్రల్ని ఎలా తొలగించుకోవచ్చో ధ్యాన ప్రక్రియాలూ, జిడ్డు కృష్ణమూర్తి రచనలూ తెలుపుతాయి."

కాంత్ అదంతా మరో రకంగా అర్థం చేసుకున్నాడు. ఎలాగోలా సరూనే తప్పు పట్టాలనుకున్నాడు.

"అయితే సరూ! ఇపుడు నీ అంతచ్చేతనలోని మన ప్రేమ ముద్రల్ని కూడా తొలగించే ప్రయత్నంలో ఉన్నావన్న మాట."

'కాంత్! మనం ఇరుగుపొరుగువాళ్లమని, ఒకే ఊరువాళ్లమని, స్నేహితులమని, మనం కాబోయే మొగుడుపెళ్లాలమని చిన్నప్పటినుంచి లోకం భావించింది. అంగీకరించింది. మన స్నేహానికి రాత్రీ పగలు కలిసి తిరగడానికి ఆమోద ముద్ర వేసింది. అదంతా గతం...' సరూ బాధను హృదయంలోనే దాచుకుని ఆవేదన వెళ్ళగక్కింది.

"ఎంత క్రూరంగా అభాండాలు వేస్తున్నావు కాంత్. పుట్టి ఊహ తెలిసినప్పటినుంచి మనిద్దరం ఒక్కటిగానే బతికాం. బట్టలు వేసుకోవడం తెలియని వయస్సు నుండి, సిగ్గంటే ఏమిటో తెలియని పసిప్రాయం నుండి కలిసి జీవిస్తున్నాం. నాపై నీకూ, నీపై నాకూ ఎంత ప్రేమ ఉందో నిర్ధారించ డానికి ఇపుడు మనకు సాక్ష్యాలు కావాలా! సాక్ష్యాల చర్చ ఎందుకు? పెళ్ళయిన మూడేళ్ళకే నేను మన ప్రేమను మరిచిపోతే దాన్ని ప్రేమంటారా? నా ప్రేమ రోజురోజుకు అవ్యక్తం చేయబడుతోంది. నేను స్త్రీని... ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను." సరూ కన్నీళ్ళు తుడుచుకొని తేరుకొని మళ్ళీ అంది.

"కాంత్! నేను మునుపటిలా నీతో నవ్వుతూ తుళ్ళుతూ స్వేచ్ఛగా ఉండలేను. మీ యింటికి మునుపటిలా ఎక్కువగా రాలేను. వస్తే లోకం నిందలు వేస్తుంది. ఇవన్నీ నీకు తెలుసు. కాని నువ్వు మగాడివి కనుక నేను నీతో మునుపటిలా ఉండాలని ఆశిస్తున్నావు. నువ్వు మాత్రం నాతో మునుపటిలా ఉండగలుగు తున్నావా! నేను ఊరినించి వచ్చానని తెల్సినా నువ్వు మా యింటికి రావు. నేను వస్తే నువ్వు మీ యింటికాడ దొరకవు."

"అయితే సరూ! నీలా మరిచిపోవడానికి కాదు. గతం గుర్తొచ్చిన బాధతో." అన్నాడు కాంత్ సరూ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"కాంత్! బాధతోనే కావచ్చు, కాని ఎవరైనా ఏమనుకుంటారో అనే భయం లేకపోతే నీవెందుకు తప్పించుకుంటావు. ఈ సరూ పరాయిది, నా సరూ కాదు అనే కదా దాని అర్థం. ఈ భయం ఇద్దరికీ కొత్తగా ఏర్పడింది. నీకు పెళ్ళి కాలేదు కాబట్టి బాధను వ్యక్తం చేయగలుగుతున్నావు. నీకు

పెళ్ళయ్యాక నీవూ నీ బాధను వ్యక్తం చేయలేవు. చేస్తే నీ భార్య గానీ, సమాజం గానీ హర్షించదు. నిందలు వేస్తుంది. చులకనగా చూస్తుంది. నువ్వు నా వ్యక్తిత్వంలో భాగమైపోయావు. నాలో సగానికన్నా ఎక్కువ నువ్వే. అది నీకు తెలుసు...".

కాంత్‌లో ఏవేవో భావాలు... సరూ ఎలా ఎదిగిపోయిందో ఆశ్చర్యం... అప్పుడే ప్రశంసించాలని అనిపిస్తుంది. అప్పుడే అసూయ కలుగుతుంది. అప్పుడే నిర్వేదం కలుగుతుంది. అన్నీ కలగలుపు భావాలు... సంఘర్షణ...

అందరి ఒత్తిడితో కాంతయ్య పెళ్లి జరిగిపోయింది. తల్లి చంద్రమ్మ చూసిన సంబంధం బాగానే ఉందని సరూ కూడ చెప్పడంతో పద్మతో పెళ్లికి కాంతయ్య సరేనన్నాడు. పెళ్లిలో సరవ్వ పద్మకు ఏవో కొన్ని ప్రజెంటేషన్స్‌తో పాటు బంగారు నెక్లెస్ తీసుకొచ్చింది. సరవ్వ సమయ స్ఫూర్తికి చంద్రమ్మ, గౌరమ్మలు ఎంతో సంతోషించారు.

పెళ్లయ్యాక కొడుకు మారుతాడనుకున్న చంద్రమ్మ ఆశ అడియాశే అయింది. పద్మను పెళ్ళి చేసుకున్నాడన్నమాటే కానీ, ఇంటి బరువు బాధ్యతలు ఎత్తుకోలేకపోయాడు. సామాజిక న్యాయం కోసం రాజ్యాధికారం కావాలి... రాజ్యాధికారం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యం... అనుకుంటూ సభలు, సమావేశాలు తిరిగాడు.

ఏవేవో పనులంటూ బయట తిరిగి ఇంటికి వస్తాడు. ఏందిరా అని తల్లి అడిగితే రెండ్రోజులు ఇంటికి రాకుండానే పోతాడు. అందుకని చంద్రమ్మ కొడుకును అలా అడగడం మానుకుంది. ఎన్నో ఆశలతో, ఊహలతో పెళ్లిచేసుకొన్న పద్మకు ఇదంతా ఏంటో గందరగోళంగా ఉందనుకుంది. తల్లిగారింటికి పోవడం, చంద్రమ్మ వెళ్లి సముదాయించి తీసుకురావడం... ఇదంతా ఎందుకు జరుగుతున్నదో తల్లి చంద్రమ్మకే తెలుసు. రోజులు గడిచిన కొద్దీ సరవ్వ తన యింటి కోడలు కాకుండా పోవడం కొడుకునెంతగా బాధిస్తున్నదో తల్లి చంద్రమ్మనూ అంతే బాధిస్తున్నది. తన చేతుల మీద పెరిగిన పిల్ల. తన కోడలే అని మురిసింది. కానీ అనుకున్నట్లు ఏది జరగలేదు.

❄ ❄ ❄

సరవ్వ తల్లి గౌరమ్మకు, చంద్రమ్మకు మధ్య ఉన్న అనుబంధం ఎన్నో ఏళ్ళనాటిది. అది మూడు దశాబ్దాల అనుబంధం. తొమ్మిది పదేండ్ల వయస్సులో చంద్రమ్మ, గౌరమ్మ జగిత్యాలకు కొత్త కోడండ్లుగా వచ్చారు. గౌరమ్మ పెండ్లిలో ఏవో లొల్లులై ఊర్లోని చుట్టాలతో సంబంధాలు తెగిపోయాయి. చంద్రమ్మ, గౌరమ్మ అత్తల మధ్య అనుబంధానికి అది నాంది అయింది. ఒకరికొకరు తోడైనారు.

అలా చంద్రమ్మ, గౌరమ్మల స్నేహానికి దారిపడింది. ఇద్దరు ఒకే ఇత్తడి ముంత తీసుకొని చెట్లచాటుకు దొడ్డికి వెళ్ళేవాళ్ళు. పెద్దమనుషులయ్యారు. ఎవరి సంసారాలు వాళ్ళవైనాయి. అనుబంధాలు పెరిగాయి. ఒకరు ఓరకుంటే మరొకరు ఉడుకు నీళ్ళు పెట్టుడు, స్నానం చేయించుడు, ఎవరి మొగుడు ఎలాంటివాడో చెప్పుకునుడు, నవ్వుకునుడు.

కాంతయ్య కార్తీక పున్నమికి పుట్టాడు. సరవ్వ శివరాత్రికి పుట్టింది. వాళ్ళు కడుపులో ఉన్నప్పుడే వియ్యాలందుకోవాలని బాసలు చేసుకున్నారు. సరవ్వ పుట్టిన నాలుగేండ్లకు ఎవరినో ఉంచుకొని ఇంటిని నిర్లక్ష్యం చేశాడు సరవ్వ తండ్రి. ఇల్లు వదిలి తిరిగాడు. ఎవరినో కూడుకున్నాడు. అన్ని బాధల్లో గౌరమ్మకు చంద్రమ్మే ఊరట. అన్ని పనుల్లో కాంతయ్యే పెద్దకొడుకు. సరవ్వ, కాంతయ్య ఒకే ఇంటి పిల్లల్లా పెరిగారు. ఒకేతీరుగా పెరిగారు. ఆడ మగా తేడా లేకుండా కలిసి తిరిగారు. ఒకే కాల పరిణామానికి బొమ్మ బొరుసు వాళ్ళు. చిన్నప్పటినుంచి ఇద్దరి స్వభావాలు, భావాలు ఒక్కటే. సరవ్వా కాంతయ్యా ఒకటే క్లాసు.

కచ్చకాయలు, తొక్కుడుబిళ్ళ ఆటల్లో సరవ్వతో పోటీ పడేవాడు కాంతయ్య. మిగిలిన ఆడపిల్లలు కాంతయ్యకు ఆడోలల్ల బోడక్క అని పేరు పెట్టారు. గుడ్డిదీపం వెలుగులో కల్సి చదువుకునేవారు. ఊళ్ళోనే స్కూలు, ఊళ్ళోనే కాలేజి. ఒకరు లేకుండా ఒకరు విడిగా ఉంటారని స్నేహితులు, బంధువులు ఊహించలేరు. వారిమధ్య ఎన్నడూ ఏ అరమరికలు లేవు. ఒకే వ్యక్తిత్వానికి, ఒకే స్థలకాలాలకు, పరిణామాలకు స్త్రీ పురుష రూపాలు వాళ్ళు. అభివృద్ధి పరిణామాలు వారి జీవితాలను రెండు పాయలుగా చీల్చాయి.

సరవ్వ కుటుంబానికి వెనకటినుంచి ఉన్న భూములు, వ్యవసాయం, కాలక్రమంలో ఇన్ని మార్పులు తెస్తాయని ఎవరూ ఊహించలేదు. కేవలం కులవృత్తిపై, రెక్కలకష్టంమీద ఆధారపడి బతికే చంద్రమ్మ కుటుంబం రోజురోజుకు చితికిపోయింది. భూములున్న వాళ్ళకు అనుకోని అవకాశాలు, అభివృద్ధి కలిసివచ్చింది. సరవ్వ తల్లి గౌరమ్మ చంద్రమ్మతోపాటు బీడీలు చేసి కాలం వెల్లదీసినా కాలక్రమంలో ఆమె కష్టాలు తీరాయి.

ఏమీ పండని భూములకు పోచంపాడు ప్రాజెక్టు (శ్రీరాంసాగర్) కెనాల్స్ ద్వారా నీళ్ళందాయి. గౌరమ్మ శ్రమతో మంచి పంట భూములయ్యాయి. భూముల ధరలు పెరిగాయి. అన్నీ కల్సి వచ్చాయి. సరవ్వ తండ్రి ఇంటి దారి పట్టాడు. అభివృద్ధి క్రమాన్నంతా తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. గౌరమ్మకు అంతదాకా ఉన్న స్వేచ్ఛ హరించింది. భర్త పెత్తనం పెరిగింది. గౌరమ్మ ఇంటి దగ్గరి పెరడు ఇళ్ళ ప్లాట్లుగా మారాయి. భూముల్ని బ్యాంకులో చూపి సరవ్వ తండ్రి ట్రాక్టర్ కొన్నాడు. ఇసుక, ఇటుక కిరాయకు నడిపాడు.

కాంతయ్య తండ్రి చేనేత కూలి గిట్టుబాటు కాక బొంబాయి చేరాడు. దత్తా సామంత్ నడిపిన ఏడాదిన్నర బట్టల మిల్లు సమ్మెతో ఇంటికి చేరాడు. సమ్మెతో ఉన్న పని పోయింది. సైకిల్‌పై బట్టలమూట వేసుకొని ఊళ్ళు తిరిగాడు. ఈ పని తనతో కాదని అరబ్బు దేశాలకు పోతానని అవీ యివీ అమ్మి ఎవరి చేతిలోనో పోశాడు. వాడు మోసం చేశాడు. అదే రందితో కాంతయ్య తండ్రి పోయాడు. గౌరమ్మ సంసారం కుదుట పడుతుంటే చంద్రమ్మ సంసారం చితికి పోయింది.

సరవ్వ తండ్రి ఉంచుకున్నామె వెంట తిరిగినపుడు లేని మగ పెత్తనం ఇంటిపట్టున ఉండడంతో ఇంట్లో కొత్తగా మొదలైంది. కాంతయ్యతో సరవ్వ పెండ్లి పట్ల జరాసంధుడయ్యాడు తండ్రి. సరవ్వ లేచిపోదామన్నా కాంతయ్య కృష్ణుడు కాలేకపోయాడు. దాంతో సరవ్వ రుక్మిణి కావాలనుకొని కాలేక పోయింది. ఆ పాత్రలను చంద్రమ్మ కూడా అడ్డుకుంది. కులాంతరం పెళ్లి చేసుకుంటే తన బిడ్డ పెళ్లి జరుగుతుందో లేదో అని చంద్రమ్మ వెనక్కి తగ్గింది. గౌరమ్మ చేతిలో ఏమి లేకుండ అయింది. అప్పుడు సరేనని అనకపోవడం పొరపాటయిందని చంద్రమ్మ ఇపుడు బాధపడుతున్నది. నడుమ కోడలు

పద్మ ఎటుకాకుండా బాధపడుతున్నది. ఇలా ముగ్గురు బాధపడడానికి తానే కారణమని చంద్రమ్మ ఆవేదన. చెరువు నీళ్లు చెరువెనక పడ్డాక చేయగలిగే దేమిటి? గౌరమ్మ జరిగిన వాటికి రాజీ పడిపోయింది.

❄ ❄ ❄

"కాంత్! నన్ను ఎదిగించినట్టుగా నీ భార్యనీ ఎదిగించు కోవాలి. అది నీ కర్తవ్యం. నా వ్యక్తిత్వ నిర్మాతల్లో నీవొకరివి. నీవు లేకుండా నేను యిలా ఎదగగలిగేదాన్నా! నీకు తెల్సు, నేను అమ్మ తర్వాత ఎక్కువగా ప్రేమించేది నిన్నే. ఒకందుకు అమ్మ కన్నా నిన్ను ఎక్కువగా ప్రేమిస్తాను" అంది సరూ కాంత్‌తో చేతులు కలుపుతూ.

ఆ మాటతో, ఆ చేష్టతో ఉద్వేగంతో తబ్బిబ్బయిపోతూ అన్నాడు కాంత్.

"సరూ! అదే నిజమైతే నాకు అంతకన్నా కావాల్సింది లేదు. మన బంధం శరీరాల సంబంధం కాదు, హృదయాల అనుబంధం."

ఆ మాటతో సరూ హృదయం ఉప్పొంగింది. దుఃఖం, ఆవేదన తగ్గి హాయిగా నిర్మలంగా నవ్వింది.

"అబ్బ! ఎంతసేపటికి నీ హృదయపేటిక విప్పావు కాంత్. ఎంత చక్కగా చెప్పావు. అన్నాచెల్లెల్లు, అక్కాచెల్లెల్లు, తల్లీపిల్లల మధ్య. ఇద్దరు పురుషులు మధ్య, ఇద్దరు స్త్రీల మధ్య ఉండే స్నేహం, ప్రేమ, అనుబంధం స్త్రీపురుషుల మధ్య కూడా ఉంటుంది. దీనికి శరీరాల కలయికతో సంబంధం లేదు. ఇది అర్థమైతే మునుపటిలా నాకు నీవూ, నీకు నేనూ పరస్పరం ప్రేరణగా గైడ్‌గా, ఫిలాసఫర్‌గా ఎప్పటికీ కొనసాగడం సాధ్యమే."

"సరూ! నేను అందుకోలేనంతటి ఎత్తులకు ఎదుగుతున్నావు. నా పేద రికం నన్ను ఎదగకుండా అడ్డగిస్తున్నది. మీకు వ్యవసాయం ఉండడం ద్వారా కులం ద్వారా అయాచితంగా అందివచ్చిన ప్రతిష్టా సహకారం నీ ఎదుగుదలలో కొంత కల్సి ఉంది. నాకు ఈ స్తోమతు లేదని నీకు తెల్సు. స్త్రీగా పుట్టడం వల్ల నీకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు కలిగినై. నీకన్నా ఎక్కువస్థాయి గల భర్త దొరికి నీ హోదా అకస్మాత్తుగా పెరిగింది. అది మగవాన్నైన నాకెలా సాధ్యం?".

"కాంత్! నువ్వన్నదాంట్లో పాయింటు లేకపోలేదు. కాని లక్షలాది పేద స్త్రీలు దేశంలో వ్యభిచార గృహాల్లో మగ్గుతున్నారు. స్త్రీలు, రేపులు చేయబడుతున్నారు. ఎంత గొప్ప స్త్రీనైనా కేవలం శరీరంగా చూసే రోత చూపులు పెట్టే యిబ్బంది, చిత్రహింస నీకర్థం కాదు.

"... కాంత్! కాని నీ చూపులంటే నాకెంతో యిష్టం. నీ కళ్లు ఎంత నిర్మలంగా ఉంటాయి. నీ చూపు ఎంత ఆత్మీయంగా ఉంటుంది. ఆ చూపులే నువ్వు నిరంతరం నా వెంటే వున్నావనే ఆత్మ విశ్వాసాన్నిస్తుంటాయి".

కాంత్ హాయిగా నవ్వాడు. ఆ నవ్వులో చిన్ననాటి స్నేహాల చొరవ... తిరిగి కనపడింది. "సరూ! మాటలకేంగానీ నీ గౌరవం, ప్రతిష్ట నాకెలా వస్తుంది. నీకు అదృష్టం కల్సి వచ్చింది. అంచెలంచెలుగా ఎదిగావు. నీది రహదారి ప్రయాణం. ఒకసారి బాటలో పడిందంటే అదే ముందుకు సాగుతుంది. నాది పిల్లబాట. ఎగుడు దిగుడు బాట. అవన్నీ అధిగమించి రహదారి చేరేసరికే ఎందరో అలసిపోతారు. నేల రాలిపోతారు. వయస్సు మీరిపోతారు. రహదారి దాకా వచ్చేది ఏ కొందరో..... సరూ..... మేం మట్టి అయితే వాళ్ళు మొక్కలుగా ఎదుగుతున్నారు. మేం ఓడిపోతే వాళ్ళు గెలుస్తున్నారు. కృషి మాదైంది, ఫలితం వాళ్ళదైంది. గెలవాల్సిన వాళ్ళ బాట పిల్లబాటగా కుదించుకపోయింది."

"కాంత్! ఏమిటి కొత్త గొంతు. నువ్వు చెప్పదల్చుకున్నదేదో నాకు అర్థమయ్యేట్టు చెప్పు ప్లీజ్."

"సరూ..... అరవై ఏళ్ళుగా వాళ్ళు అనుభవిస్తున్న ఉద్యోగ విద్యావకాశాల్లో అధిక శాతం మాకు అందకుండా లాక్కున్నవే. వాళ్ల జనాభాకన్నా అదనంగా అనుభవిస్తున్నదంతా ఎవరిది? మాకు చెందాల్సింది కాదా? జనాభా నిష్పత్తిలో ఎస్సీలది ఎస్సీలకు, ఎస్టీలది ఎస్టీలకు రిజర్వేషన్లు పోగా, వాళ్ళు అదనంగా పొందుతున్నదంతా బీసీలది కాదా?

... ఇప్పుడు మహిళా రిజర్వేషన్లు అని ఉద్యమిస్తున్నారు. బీసీలకు రిజర్వేషన్లు కోరకుండా, మహిళా రిజర్వేషన్లు కోరడం అంటే ఆధిపత్య వర్గాల, కులాల మగవాళ్ల స్థానాల్లో వారి మహిళలు ఎదగడం తప్ప మాకు

ఒరిగేదేముంది? 1932లో పూనా ప్యాక్టుతో పాటు బీసీ రిజర్వేషన్లు కూడా అమలయి వుంటే వాళ్ళకు ఈ ఆధిక్యత, అవకాశాలెక్కడివి. బీసీలే ఎదిగేవాళ్ళు. మీ ఆయన కన్నా ఉన్నత స్థాయిలో నేనుండేవాడిని కదా! మన పెళ్ళి జరిగి ఉండేది కాదా!"

సరూకు దుఃఖం, కోపం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. తమ పెళ్లికి ఇవన్నీ ఎలా అడ్డంకులో సరూకు అర్థం కాలేదు. చేతకాని తనానికి చరిత్రను, సిద్ధాంతాలను ముందుకు తెచ్చి మనస్సులను దూరం చేసుకోవడం తప్ప, కాంత్ ఏం సాధించదలచుకున్నాడో సరూకు అర్థం కాలేదు. కన్నీళ్ళు కంట్లోనే బిగబట్టి కోపంగా అరిచింది.

"కాంత్! అప్పుడు మనం పెళ్లి చేసుకుందామంటే నీకు చాతగాలేదు గానీ–ఇపుడు చరిత్ర బరువంతా మోస్తానని బడాయి దేనికి నీపిరికితనం వల్లే మన పెళ్లి కాలేదు. స్వీయ మానసిక ధోరణితో చరిత్రను క్షణికావేశాల కనువుగా ఎట్లా పడితే అట్లా వ్యాఖ్యానించవద్దు.... ప్లీజ్.

... అయితే ఒకటి ఒప్పుకుంటాను. నేను సిటీలో ఉండడం వల్ల పుస్తకాలకు, మీడియాకు, మీటింగులకు దగ్గరగా ఉండడం వల్ల ప్రాచుర్యం తొందరగా వచ్చింది. నువ్వు ప్రజలకు, వాస్తవాలకు దగ్గరగా ఉన్నా మీడియాలో మీకు బలమైన వాయిస్ లేనందువల్ల వ్యాప్తిలోకి రాలేకపోయావు.

... అయినా యిప్పటికీ నన్ను నువ్వే నడిపిస్తున్నావు. కాని కంపార్ట్‌మెంటల్ ఇనిర్ఫిరియారిటీ సైకాలజీని ఒదులుకోలేకపోతున్నావు. నీలోకి నువ్వు ముడుచుకొని పోవడం వల్లే నీవు ఆగిపోతున్నావు. మీ బీ.సీ. ఉద్యమంతో బీసీలకు అన్ని స్థాయిల్లో రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా ఏర్పడేదాక నన్ను, మహిళా ఉద్యమంలో ఇక్కడే ఆగి ఉండాలని కోరుకోవద్దని కోరుతున్నాను."

"అలా కాదు సరూ... మీ వ్యక్తిగత అభివృద్ధిని, స్వార్థాన్ని పక్కకు పెట్టి మీ మహిళలంతా మా వైపు నిలబడి మీ కోసం కాకుండా మా కోసం, మావారి కోసం ఉద్యమించాలనేది మా కోరిక... డిమాండు."

"కాంత్! మహిళలు ఎస్సీ, బీసీలలాంటివారే. అయినా కొన్ని సౌకర్యాలు ఉన్న మాట నిజమే. ఉద్యమించడంలో మా పరిమితులు మాకున్నాయి.

కుటుంబాలతో, పిల్లలతో కలిసి జీవిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ మగవారిలా అన్ని రకాలుగా ఉద్యమించడం ఫెమినిస్టులతో కాని పని. పితృస్వామిక, పురుషాధిపత్యం, మహిళలను ఇంటి పనికి పరిమితం చేస్తూ, ఆ పనులన్నీ తీరాకే ఎటైనా వెళ్లు అంటున్నారు.

అయినా అన్ని పనులు ఒక్కరే చేయలేరు. మీ ఉద్యమం మీరు చేయండి. మీ వెంట ఫెమినిస్టులు ఉంటారు. మద్దతు ఇస్తారు. అంతేగాని మీతోపాటు ఉద్యమంలో కలిసి నడవలేరు. మీ ఉద్యమాన్ని వాళ్ళు చేయలేరు."

"సరూ! మహిళల్లో ఎనభై శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలే కదా! అయినా బీసీ రిజర్వేషన్ల కోసం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు మహిళా రిజర్వేషన్ల కోటాలో సబ్ కోటా కోసం ఉద్యమించకుండా, చేసే ఉద్యమాలవల్ల ఎవరికి ఉపయోగం?

సరూ...! ఫెమినిజం ముసుగులో స్వార్థ రాజకీయాలను గమనిస్తున్నావు గదా!. ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, మహిళా వ్యతిరేకులని పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల బిల్లును వ్యతిరేకిస్తున్న పురుషాధిపత్య వాదులని ప్రచారం చేయడంలో నిజంగా మహిళలందరి ప్రయోజనం లేదని నువ్వెందుకు వాళ్ళతో వాదించలేక పోతున్నావు". అంటూ కాంత్ సరూకేసి తీక్షణంగా చూశాడు. మహిళావాదులపై గల కోపాన్నంతా తనమీద తీర్చుకోడం సరూ ఊహించలేకపోయింది. దశాబ్దాల స్నేహాన్ని, ఆత్మీయతల్ని పట్టించుకోకుండా తనను విమర్శించడం తట్టుకోలేక పోయింది.

"కాంత్! నీ ఒక్కో మాట నా గుండెల్లో కత్తిలా దిగుతున్నాయి. మన అమ్మలకు మన కులాలు కనపడలేదు. నీకు, నాకు ఇన్నాళ్లు కులాలు కనపడలేదు. ఇన్నాళ్ళు కనపడని కులం, నీకిప్పుడు కనబడిందా! ఎంతెంత మాటలంటున్నావు. అపుడు పెళ్లి చేసుకుందాం అంటే పిరికిపందలా పారిపోయి చిత్రహింస పెట్టావు. ఇపుడేమో యిట్లా.... నన్నిట్లా హింసించక ఒక్కసారి చంపేయరాదూ...." సరూ వెక్కివెక్కి ఏడుస్తోంది.

సరూను ఎలా ఓదార్చాలో కాంతయ్యకు అర్థం కాలేదు. తన చేతకానితనంపై తనకే చాలా కోపం వచ్చింది. ఒకటి అర్థం చేయించాలను

కుంటే మరొకలా అర్థం చేసుకుంది. సరూ వెక్కి వెక్కి ఏడ్వడం చూసి కాంతయ్య ఆవేశం చప్పున చల్లారిపోయింది.

"సారీ సరూ... నిన్ను గాయపరచాలని నా ఉద్దేశం కాదు. అరవై ఏళ్ళుగా బీసీలకు అందాల్సింది అనుభవించి, అందులో భాగంగా ఎదిగిన ఆడవాళ్లు... తమ ప్రయోజనాలు, రాజ్యాధికారమే ప్రధాన స్రవంతై జనాభా నిష్పత్తి ప్రకారం మాకు అందాల్సినవన్నీ అందకుండా చేయబడు తున్నాయి. ఫెమినిస్టులు మహిళలకు అధికారం అనే ముసుగులో బీసీ ఎస్సీలను వెనక్కి నెట్టి మరో అరవై ఏళ్ళు వాళ్ళే ఆధిపత్యంలో ఉండాలని చేస్తున్న కుట్ర! అని నీకు తెలుసు.

సరూ! ఇది నా ఒక్కరి బాధ కాదని కూడా నీకు తెలుసు. ఆ బాధను ఫెమినిస్టులు అర్థం చేసుకోలేకపోతున్నందుకు బాధగా ఉంది. నేను ఎవరికి చెప్పుకొని ఏడ్వాలో తెలియడం లేదు." సరూ కళ్లల్లోకి సూటిగా చూడలేక పోయాడు కాంత్.

ఆవేదనగా తల వంచుకొని నేలకేసి చూశాడు కాంత్. సరూ ఎంత బాధపడుతుందో కాంత్‌కు తెలుసు. కానీ ఇవన్నీ సరూతో తప్ప చర్చించడానికి తనకు సన్నిహితులు ఎవరున్నారని... సరూతో చర్చిస్తే మహిళా ఉద్యమంలో ఈ విషయాలు చర్చకు తెస్తుందని కాంత్ ఆశ...

సరవ్వ కళ్ళు తుడుచుకుని దుఃఖాన్ని అదిమిపట్టి మాటలు కూడగట్టుకొని అంది "కాంత్...! నువ్వన్నది నిజమే. మీకోసం మీ మహిళలు ముందుకు రావడానికి మీరే ప్రోత్సహించాలి. మహిళా ఉద్యమంలో ఎక్కువ సంఖ్యలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలను ప్రోత్సహిస్తే తప్పకుండా సాధ్య పడుతుంది.

ఫెమినిస్టులు ఓడి మీరు గెలిచినా సంతోషమే. మీరు ఓడితే... ఫెమినిస్టులు గెలిచాక మీ గెలుపు కోసం పార్లమెంటుతో సహా అన్ని స్థాయిల్లో మీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ తెస్తారు. వాళ్లు మీకోసం పోరాడకపోయినా మీ పోరాటాలకు పూర్తి మద్దతు ఇవ్వడానికి మహిళా ఉద్యమాల్లో మద్దతు కూడకడతాను... ఏమైనా ఇద్దరి దారి వేరు కాదు. మనిద్దరిదీ ఒకే దారి. నా హృదయంలో నీ స్థానం ఎప్పటికీ పదిలమైనదే." అంటూ నవ్వింది సరూ...

సరూ అర్థం చేసుకున్నందుకు ఎంతో సంతోషపడిపోయాడు కాంత్. సరవ్వనుండి హామీ తీసుకొని సెలవు తీసుకున్నాడు.

❄ ❄ ❄

వారు ఆశించిన స్థాయిలో ఉద్యమాలు ముందుకు సాగడంలేదు. పొట్ట కూటికోసం, పిల్లల పెంపకం కోసం, భర్త, అత్తమామల అవసరాలకోసం మహిళలు చిన్న చిన్న వృత్తులకు, ఇంటికి పరిమితమైపోవాల్సి వస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఎన్నో పరిమితులు...

మహిళా ఉద్యమాలలో సరవ్వ ఎదుగుతుంటే అభినందించాడు కాంత్. అయినా ఎందుకో లోలోపల బాధ... తమ ఉద్యమాలు ఎదగలేకపోతున్నా యని ఆవేదన... అసూయ, ఎంత వద్దన్నా గూడు కద్దున్నాయి.

ఇప్పుడు సరవ్వ ఉత్తరాలకు జవాబు రాయడం లేదు. ఎన్నిసార్లు హైదరాబాద్‌కు రమ్మని పిలిచినా వెళ్ళడం లేదు. సరూ లీవు పెట్టి యింటికొచ్చినా తప్పించుకుంటున్నాడు కాంతయ్య.

❄ ❄ ❄

అరుగుమీద ఎవరు లేకపోవడం చూసి "గౌరత్తా" అంటూ యింట్లోకి నడిచాడు కాంతయ్య. గౌరమ్మ, మరో ముగ్గురు స్త్రీలు కల్సి రాత్రి భోజనాల కోసం ఏవో అప్పాలు చేస్తున్నారు.

"కాంతూ! ఇన్నాల్లకు యాదికొచ్చిందా మా యిల్లు" ఆప్యాయంగా పలకరించింది గౌరమ్మత్త. అట్లా బియ్యం బస్తాకు ఒరిగి కూర్చోమంది. మరీ బక్కచిక్కిన కాంతయ్యను చూసి ఎందుకో కళ్ళొత్తుకుంది.

"అటూ యిటూ చూశాడు కాంతయ్య. ఇంట్లోకి వచ్చినప్పటికీ సరవ్వేది అని అడగడానికి కాంతయ్యకు అభిమానం అడ్డొచ్చినట్టుంది. ఆ చూపులు గౌరమ్మత్తకు కొత్త కాదు.

"సరవ్వ మీ యింటికేయే పోయింది. అందరికి బోయినాలకు చెప్పి వస్తనన్నది. ఎవలింటికాడ ఆగిందో. అట్ల అరుగు మీద కూసో. గూట్లె అది తెచ్చుకున్న కొత్త పుస్తకాలున్నయి. ఇంతట్ల అవి చూస్తుండు" అంది గౌరమ్మ.

వంటింట్లోంచి అరుగు మీదకు వచ్చాడు కాంతయ్య. గూట్లోని పుస్తకాలు విషయ సూచికలు తిరగేశాడు. అవన్నీ స్త్రీవాద కోణంలో ప్రపంచాన్ని, చరిత్రను, మానవ సంబంధాలను, సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి సంబంధించినవి. ఎక్కువ మేరకు ఇంగ్లీషు పుస్తకాలే. అవన్నీ చూస్తూ కాంతయ్య ఆశ్చర్యపోయాడు. ఆమె జీవితం ఎదుగుదలలో ఎన్ని శిఖరాలో. రహదారులన్నీ ఆమెవే.

... తనకు ఏ దారీ లేదు. అల్పత్వ భావనతో మనసు చిన్నబోయింది. వెళ్లిపోదామా అని రెండుమూడుసార్లు అనుకున్నాడు గానీ ఎందుకో వెళ్ళలేకపోయాడు. ఇపుడు మాట్లాడుకోకపోతే మళ్ళీ ఎన్నేళ్ళకొస్తుందో..... కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

కాంత్ దీనవదనం కుక్కపిల్ల కుర్చీలో ఒద్దికగా ముడుచుకొని పడుకున్నట్టుగా ఉంది. అతని మనస్సు అల్లకల్లోలంగా ఉంది. బయల్దేరినపుడు కూడగట్టుకున్న ధైర్యం కరిగిపోయింది. అకస్మాత్తుగా లేచాడు. గబగబా బయటకు నడిచాడు. ఎదురొస్తున్న సరవ్వను ఢీకొట్టబోయి ఆగాడు.

“నమస్తే అంకుల్” అంటూ సరవ్వ కూతురు కాంతయ్య దగ్గరకు పరిగెత్తుకొచ్చి చేతులు చాపింది. పాప ఎంతో ముద్దుగా ఉంది. అచ్చం చిన్నప్పటి సరూనే. పాపని ఎత్తుకొని ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాడు కాంతయ్య.

“మంచిగున్నవా కాంత్” అంటూ సంతోషంగా పలకరించింది సరూ. చిలిపిగా ఆనందంతో కాంతయ్య కళ్ళల్లో కళ్ళుపెట్టి చూసింది సరవ్వ. కాంతయ్యలో ఏదో విద్యుత్తు అణువణువూ ప్రవహించింది. కాంతి నిండిన దేహం ఎంతో తేలికై నట్టనిపించింది. అది కొద్ది క్షణాలే. కాని ఎన్నో ఏళ్ళ దూరాన్ని, విభేదాల్ని తొలగించి వేసింది. మాటరాక కాసేపు పరస్పరం అలాగే చూస్తూ ఉండిపోయారు. తేరుకొని అరుగు మీదకు నడిచారు. కొద్దిసేపట్లోనే కాంతయ్యలోని బెరుకు తగ్గిపోయింది. సరవ్వ మాట్లాడుతుంటే భాష మారడాన్ని కాసేపటికి గమనించాడు.

“సరూ.... నువ్వు మల్లా మన పల్లెభాషలో మాట్లాడుతుంటే నాకెంత సంతోషంగా ఉందో తెల్సా. నువ్వు మల్లా నా పాత సరూవే అన్పిస్తున్నది.”

"ఇంతకుముందు మాత్రం నీపాత సరూని కాదా కాంత్" నవ్వింది సరూ.

"సరూ...... నువ్వీ చీరలో ఎంత అందంగా ఉన్నావో..... నువ్వా ప్యాంట్లు షర్టులెందుకేసుకొంటావో గానీ నీకస్సలు బాగుండవు....."

"అదిగో అదే మగదృష్టి అంటే...." అంటూ నవ్వింది. ఇలాంటి చీరంటే కాంతయ్యకు ఎంతో యిష్టమనే కట్టుకుంది సరూ. కాని తనలోని స్త్రీ తాలూకు సహజ ఆసక్తిని బయట పెట్టకుండా మళ్ళీ తనే అంది.

"అయితే కాంత్! నేను మీ అమ్మలా, మా అమ్మలా గోచీ చీర కట్టుకుంటే యింకా మంచిగుంటాను కదా. నువ్వేమో ధోవతి కట్టుకొని నెత్తికి రుమాలు పెట్టుకుంటే నేనేమో సిగల బంతిపూలు పెట్టుకుని మనిద్దరం ఫోటో దిగుదాం. ఎనుకటి జన్మల భార్యాభర్తల్లా భలే ఉంటది గదా. కాని నా బాధేమిటో తెల్సా కాంత్. చీరను మన భారతీయ సంస్కృతిగా మన మగవాళ్ళుకూడా ధరించి గౌరవించాలని" నవ్వుతూనే చురక అంటించింది సరూ.

గంటలతరబడి గలగల మాట్లాడుకున్నారు. ప్రపంచమంతా వారి మాటల్లో దొర్లిపోయింది. సామాజిక ఉద్యమాలు, సామాజిక న్యాయం, సామాజిక మార్పు, మహిళా ఉద్యమాలు... ఉద్యమాల్లోని చీలికలు... నాయకత్వ స్వార్థాలు... నాయకులమధ్య సంఘర్షణ... ఇలా ఎన్నో చర్చించుకున్నారు. మళ్ళీ చిన్నపిల్లల్లా హాయిగా మారిపోయారు. పాత కోపాలు మరిచిపోయారు. మాటల్లో ఎలా తిరిగి సన్నిహితమయ్యారో గమనించే సరికి వాళ్ళకే ఆశ్చర్యం వేసింది. సరూ అన్ని విషయాల్లో కాంత్‌తో ఏకీభవించడం కాంత్‌కు చాలా సంతోషంగా ఉంది. సరూ కూతురు అమ్మమ్మ దగ్గరకి, అమ్మదగ్గరికి, కాంత్ దగ్గరికి పరిగెడుతూ రకరకాల అప్పాలు తెచ్చి ఇస్తోంది...

"సరూ! పారిశ్రామికీకరణ మీకు ఆధునిక అభివృద్ధిని, నాగరికతను యిచ్చింది. ప్రాజెక్టులు పనికిరాని భూముల్ని పంట భూములుగా మార్చినై కాని పారిశ్రామీకరణ మా వాళ్ళకు ఉన్న కులవృత్తులు పోగొట్టింది. కొత్త వృత్తులు ఎదగడానికి పనికిరాలేదు. జీవితాలు కాలే కడుపులతో కొడిగట్టి పోయినై. అంబేడ్కర్ ఎందరికో వెలుగు చూపినా గాంధీ పంథాయే రహదారి అయింది. కాని ఈ యిద్దరికీ గురువైన జ్యోతిబా ఫూలే వేసిన బీసీల దారి అక్కడే ఆగిపోయింది.

"చూడు కాంత్. మహాత్మా ఫూలే తన భార్యకు అక్షరాలు నేర్పి టీచర్‌గా తీర్చిదిద్దాడు. ఆ సావిత్రిబాయి ఫూలే మన దేశంలోని మొదటి మహిళా టీచరు. ఈ ఆదర్శాన్ని నీవే ముందుకు తీసుకుపోవాలి.

నీ భార్య పద్మ మరీ చదువు రానిదేమీ కాదు. ఇంటర్ చదివిన అమ్మాయిని నీకనుకూలంగా తీర్చి దిద్దుకోలేకపోతే ఇక సమాజాన్నెలా తీర్చిదిద్దుతావు. ఆమె నీకు చెప్పకుండా పోయింది సరే. మరి నువ్వే పోయి రమ్మని ఎందుకడుగలేదు. సరవ్వ వల్లనే నా సంసారం గిట్లయిందని మీ ఆవిడ అనుకుంటే ఆ తప్పు ఎవరిది. అలా అనుకోవాలనే నీ ఉద్దేశమా!" నవ్వింది సరవ్వ.

సరవ్వ తమ ఇంటికెళ్లి అమ్మతో అన్ని విషయాలు మాట్లాడిందన్నమాట అనుకున్నాడు కాంత్. కాస్త సిగ్గుపడిపోయాడు. సరూ కాంత్‌ను తప్పు అనుకోవడం లేదు. అదేమాట చెప్పింది. దాంతో కాంత్‌కు ఆత్మ విశ్వాసం పెరిగింది. సరవ్వపట్ల హృదయంలో మరింత గౌరవం పెరిగింది. అయినా మరోవైపు ఏదో తప్పు చేశానా అని మనసులో పీకుతోంది. అమ్మ మరీ మరీ కల్సి రమ్మని కోరడం... సరూతో ఈ మాట చెప్పించడాని కేనా! అని కాంతయ్యకు సందేహం కలిగింది.

"చూడు కాంత్! నీవూ నేనూ చిన్న పిల్లలం కాదు. నిన్ను నీవు ఎంత సమర్థించుకున్నా అసలు విషయం నీ హృదయానికి తెల్సు. కేవలం స్వవిషయాలు పట్టించుకొని సామాజికంగా ఎదగాల్సిన విషయాల్ని పట్టించుకోవడం లేదు.

ఇందుకు కారణం నేనే అని నాకు తెలుసు. ఇది తెలిసీ నీ గురించి ఆలోచిస్తూ బాధపడ్తుంటాను. రాగ ద్వేషాలలో పడిపోయి జీవన సంక్షోభంలో నిరంతరం సంఘర్షణకు లోనవుతున్నప్పటికీ దశాబ్దాలు గడిచినా మనం ఒకరి భావాలను ఒకరం, ఒకరి ఆశయాలను ఒకరం గౌరవించుకోవడానికి మన ప్రేమే కారణం కదా.

కాంత్! జీవితంలో ప్రేమను ఒక చక్కటి అనుభవంగా తీసుకోవాలి. ఆ స్ఫూర్తితో సమాజం కోసం ఒక రచయితగా, కళాకారుడిగా ఎదగాలి. నన్ను ప్రేమించినంతగా సమాజాన్ని ప్రేమించాలి. నీవెంట నేనొక్కదాన్నే ఉండడం

కాదు. ఇపుడు పద్మ కూడా మన ఆశయాల్లో సిద్ధాంతాల్లో భాగం కావడానికి సిద్ధంగా ఉంది. అందుకు నీవు కొంత త్యాగం చేయాలి."

కాంతయ్యకు సరూ మాటల్లో ఏదో సత్యం ఉందనిపించింది.

❄ ❄ ❄

ఏడాది గడిచింది. పద్మ కాంతయ్య చెట్టాపట్టాలేసుకొని ఒక్కటయ్యారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను చదివిన తర్వాత పద్మలో చాలా మార్పు వచ్చింది. పత్రికలకు వ్యాసాలు రాయమని, కాంత్ పద్మను ప్రోత్సహించాడు. పద్మ డ్వాక్రా సంఘాలతో, స్వశక్తి సంఘాలతో మహిళా బీడీ కార్మికులతో, మహిళా టీచర్లతో, మహిళా మునిసిపల్ స్వీపర్లతో, వర్కర్లతో కలిసి తిరుగుతూ ఉంది. తులఉమ అక్కయ్యతో సాన్నిహిత్యం పెంచుకొంది. సరవ్వతో ఫోన్‌లో మాట్లాడుతూ అనేక సూచనలు తీసుకొంటుంది.

కాంత్ జగిత్యాలనుండి కరీంనగర్ జిల్లా అంతటా ఉద్యమకారుడిగా తిరిగాడు. హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా వెళ్తున్నాడు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న సామాజిక ఉద్యమాల్తో కలిసి పనిచేస్తున్నాడు. ఇతర ప్రాంతాలకు వక్తగా, ముఖ్య అతిథిగా పిలుస్తుంటే కాంతయ్యలో ఎంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. జగిత్యాల ఆర్డీవో ఆఫీస్‌లో పత్రిక రిజిస్ట్రేషన్ కోసం అనేక పేర్లు సూచిస్తూ, పద్మ పేరిట అప్లై చేశాడు. ఢిల్లీలోని పత్రికల రిజిస్ట్రార్ కార్యాలయంనుండి 'మమతలు' అనే టైటిల్ కేటాయిస్తూ లెటర్ వచ్చింది.

పద్మను సంపాదకులుగా ఉండాలని, నేను సహకరిస్తానని కాంత్ పద్మను ప్రోత్సహించాడు. పద్మ భయంభయంగానే ఒప్పుకుంది. ఇద్దరుకలిసి ఎంతో ఉత్సాహంగా ప్రారంభ సంచిక తీసి అందరికి పంచారు. పత్రికను అభినందిస్తూ ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. సరూ నుండి వచ్చిన ఉత్తరాన్ని ఆసక్తిగా చదివింది పద్మ.

"ప్రియమైన పద్మకు, నమస్కారం. మీరు తీసిన పత్రిక తొలి సంచిక అందింది. నీవు ఎడిటర్‌గా, కాంత్ మేనేజర్‌గా ఉండడం సంతోషం కలిగించింది. అభినందనలు. పత్రిక అంతా బాగుంది. సంపాదకీయం నన్ను దృష్టిలో పెట్టుకొని రాయలేదు గదా అని మనసు పీకుతోంది.

నేనొక పత్రిక సంపాదక వర్గ సభ్యురాలినై ఉండి కూడా మీరొక పత్రిక పెట్టండి అని మీకూ, రజితకూ సూచించని మాట నిజమే. కాని బీసీ ఎస్సీలు స్వయంగా పత్రికలు తీయాలని సూచించలేకపోవడంలో కులాధిక్యత ఉందన్న నీ అభిప్రాయం నన్ను బాధపెట్టింది. అయినా ఆధిపత్య కులాల వాళ్ళు బీసీ ఎస్సీలకు చేసే సూచనల్లోగానీ ఎదిగిన ప్రాంతాల వాళ్ళు వెనకబడిన ప్రాంతాల వారికి చేసే సూచనల్లోగానీ, వారి నాయకత్వంలోగానీ, వారి ఆధిక్యత, ఆధిపత్యం స్థిరపరచుకోవడం కూడా ఉంటుందన్న మాటలో నిజం లేకపోలేదు.

అయితే పద్మా! మీ వ్యక్తిగత జీవితం, సంసారం బాగుపడాలని కోరుకోవడంలో నా ఆధిక్యతా ప్రదర్శనేమీ లేదు. కాంత్ పట్లా నీ పట్లా ప్రేమ తప్ప నాకు మరో దృష్టి లేదు. మీరు నా వాళ్ళు... నాలో భాగం. నాపై నేను ఆధిక్యతను ప్రదర్శించుకోవడం ఎలా సాధ్యం? కాని మీ సామాజిక జీవితం మా కన్నా ఉన్నతంగా ఎదగాలని ఉన్నప్పటికీ నిర్దిష్టంగా సూచించలేకపోవడం నా పొరపాటే...

పద్మా! మన స్నేహం అపార్థాల మబ్బులు వీడి పరస్పర సహకారం, ప్రేమ, అనురాగ సంబంధాలు యిలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన ప్రేమ ముందు డబ్బు, అధికారం, స్వార్థం, కులం, మతం అన్నీ వట్టివే – అని బుద్ధుడు ఆచరించి చూపిన మార్గం మనకు ఆదర్శం కావాలి.

మన భావాలను ప్రజల్లోకి తీసికెళ్ళడానికి పత్రిక మనకొక బలమైన ఆర్గనైజర్. అచ్చయిన వాక్యాన్ని వెనక్కి తీసికోలేము. కనుక అచ్చేసే ముందు ఎంతో సమగ్రంగా సంయమనంతో ప్రతి వాక్యాన్ని తిరిగి తర్కించి చూసుకోవాలి. మీ పత్రిక క్రమం తప్పకుండా వెలువడాలని – మన ప్రాంతం నుండి మరిన్ని పత్రికలు వెలువడాలని మన ఉద్యమం ముందుకు సాగాలని కోరుకుంటున్నాను...

– మీ సరూ.

పద్మకు ఆ ఉత్తరం చదివాక వాళ్లాయన మీద కోపం వచ్చింది. ఆ ఉత్తరాన్ని విసురుగా అతని చేతికిస్తూ అంది పద్మ.

"సరక్క ఉత్తరం ఎంత బాగా రాసిందో చూడండి. మీరు సరక్కను దృష్టిలో పెట్టుకొని సంపాదకీయంలో విమర్శించడం సరక్క గమనించింది. ఎంత బాధపడ్డదో చూడండి. అది నేనే రాశానేమోనని అక్క అనుకుంటుంది. మా మధ్య అపార్థాలు పెరుగుతాయి. దయచేసి ఇక నుండి నా పేరు మీద మీరు సంపాదకీయాలు రాయకండి.

ఇకనుండి మీరు రాయాలనుకుంటే మీకిష్టమైన కలం పేరుతో వ్యాసంగా రాయండి. ఎడిట్ చేసి అచ్చేస్తాను. ఇక నుండి నా సంపాదకీయాలు నాకొచ్చిన భాషలో నేనే రాసుకుంటాను. కులాలకు అతీతంగా మహిళలందరూ ఒక్కటి కావాలని, మనుషులందరూ మమతలు పెంచుకోవాలని ప్రారంభించిన పత్రికలో తొలి సంపాదకీయంలోనే మనుషులను కలిపేబదులు కులాల పేరిట, స్త్రీ పురుషుల పేరిట అంతరాలను సృష్టించి కులతత్వాల్ని రెచ్చగొట్టి మిత్రుల్ని శత్రువులుగా మార్చేసే మీ సంపాదకీయాలు వద్దు" అంది పద్మ.

పద్మలో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం, అవగాహన చూసి కాంత్ సంతోషంతో తబ్బిబ్బయ్యాడు. సరూ రాసిన ఆ ఉత్తరం గబగబా చదివి లోలోన నవ్వుకున్నాడు. పద్మ కళ్ళల్లోకి చిలిపిగా చూశాడు.

"అబ్బో అక్క మీద ఎంత ప్రేమో. ఇదే పట్టుదల అధ్యయనంలోనూ చూపిస్తే సరూలాగ నువ్వు ఎదగడానికి ఎంతో కాలం పట్టదు." అంటూ ఆ ఉత్తరాన్ని తిరిగి యిచ్చివేస్తూ పద్మ చేతిని ముద్దు పెట్టుకొన్నాడు. పద్మ నవ్వుతూనే చురక అంటించింది.

"వేళాపాళా లేకుండా ముద్దుల ముసుగులో ఈ మగ పెత్తనం ఏమిటి? సరక్కా నేనూ కల్సి ఈ మీ మగ పెత్తనం పై యుద్ధం చేస్తాం... నిస్వార్థ ప్రేమ ముందు అధికారం, స్వార్థం, కులం, మతం అన్నీ వట్టివే అని నిరూపిస్తాం".

'దయచేసి రాజకీయాల కోసం మానవ సంబంధాల్ని బలి పెట్టకండి'. అనే శీర్షికతో పద్మ రెండో సంచికలో సంపాదకీయం రాసింది.

పద్మా, తానూ కల్సి సరూను, ఆధిపత్య కులరాజకీయాలను ప్రశ్నించాలనుకుంటే తన అంచనా తిరగబడింది. ఇపుడు మహిళలు ఒక్కటై ఇక నుండి తమను సాధిస్తారన్న మాట....." అనుకున్నాడు కాంత్.

పద్మ ఆర్గనైజర్‌గా, లీడర్‌గా ఎదగాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఉద్యమాల్లో మహిళలు నాయకత్వంలోకి వచ్చినపుడు ఇది పరిష్కారం అవుతుంది. సాధ్యపడుతుంది. అందుకు తాను, సరూ తమ జ్ఞానాన్ని, అధికారాన్ని, ఆధిపత్యాన్ని సర్వస్వాన్ని పద్మకు ధారపోయాలి అని అనుకున్నాడు కాంత్. అదే విషయం విశ్లేషిస్తూ 'మమతలు' పత్రిక మూడో సంచికలో కలం పేరుతో వ్యాసం రాశాడు కాంత్. సరూ ఆ వ్యాసం చదివింది. తన కర్తవ్యం గుర్తుచేసినందుకు కాంత్‌ను అభినందిస్తూ పద్మకు ఫోన్ చేసింది.

"పద్మా...! నువ్వు ఇకనుండి మీ జిల్లాకు పరిమితం కాకూడదు. రాష్ట్ర నాయకురాలిగా రాష్ట్రమంతా నాతోపాటు పర్యటించాలి. అందుకు కొన్ని త్యాగాలు చేయకతప్పదు. మీరిద్దరు చర్చించుకొని పిల్లల్ని కనడం, కొంతకాలం వాయిదా వేసుకుంటే ఇదెంతో సులభం. ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి" అంది సరవ్వ.

ఆ మాట కాంత్‌తో పద్మ చర్చిస్తుంటే తల్లి చంద్రమ్మ చెవిలో పడింది. చంద్రమ్మ ఎందుకో అంగీకరించలేకపోయింది. కొడుకు లేకుండా చూసి కోడలుతో తనకు మనువడో, మనవరాలో కావాలనుకున్న విషయం కదిపింది చంద్రమ్మ.

"నీ కొడుకునే అడుగు అత్తమ్మా!" అంది పద్మ నవ్వుతూ. తనక్కూడా ఇష్టం ఉన్నా పద్మ బయటపడలేదు.

ఇప్పుడిప్పుడే దారికొస్తున్న కొడుకును అడిగి మళ్లా ఇంటికి రాకుండా చేసుకోవడం చంద్రమ్మకు ఇష్టంలేకపోయింది.

**ఆదివారం ఆంధ్రప్రభ దినపత్రిక,**
**జూన్, 1999 (మూడు వారాల కథ)**

❄ ❄ ❄